నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 30 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

# మమ్మల్ని నాటండి మహాప్రభో!



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నర్సరీలో ఏపుగా పెరిగిన మొక్కలు

### వాన కురిస్తేనే తీసుకెళ్తారంట..



గతంలో జూన్ నెల వస్తే చాలు ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలను నాటేవారు. ఈ ఏడాది నర్సరీల్లోనే పెద్దగా పెరిగాయి. వర్షాలు కురిస్తేనే మొక్కలు తీసుకెళ్తామని అధికారులు చెబుతున్నారు. మాకు ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాం. వానలు కురిస్తే తప్పా ఎవరూ మొక్కలను తీసుకెళ్లేటట్లు లేదు. ఈసారి వర్షం కోసం ఇటు రైతులు, అటు ప్రజలు పూజలు కూడా చేస్తున్నరు.

*- రాజేశ్వరి, నర్సరీ నిర్వాహకురాలు, మరికల్, నారాయణపేట జిల్లా*

- నర్సరీల్లో ఏపుగా పెరిగి వృథాగా పడి ఉన్నాం
- జూన్ ముగుస్తున్నా హరితహారం ఎప్పుడు?
- రాష్ట్ర ప్రభుత్వానికి పచ్చదనంపై పట్టింపులేదా..?
- ఉమ్మడి జిల్లాలోని కోటికిపైగా మొక్కల వేదన

*"నాలుగు నెలల నుంచి నర్సరీల్లో ఏపుగా పెరిగాం.. రక్షణ కవర్లలో ఉన్న మట్టిలోంచి వేళ్లు బయటకొచ్చి నేలలోకి చొచ్చుకుపోతున్నాం.. పక్కపక్కనే మొక్కలు ఉండడంతో పెరుగుదల మందగించింది.. సరైన పోషకాలు అందక ఇక్కడ మగ్గిపోతున్నాం.. కొన్ని నర్సరీల్లో నీళ్లులేక ఎండిపోతున్నాం.. మమ్మల్ని నాటండి మహాప్రభో.. కేసీఆర్ ప్రభుత్వం వర్షాలు ప్రారంభమైన వెంటనే జూన్‌లోనే హరితహారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేది.. మాకు స్వేచ్ఛనిస్తూ రోడ్లకిరువైపులా.. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ఇండ్లు, ఖాళీ స్థలాల్లో నాటించేటోళ్లు.. కానీ ప్రస్తుతం జూన్ మాసం ముగుస్తున్నా పట్టించుకోవడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వానికి పచ్చదనంపై పట్టింపు లేదా"..?* **అంటూ నర్సరీల్లో పెరుగుతున్న కోటికిపైగా వివిధ రకాల మొక్కలు అధికారులను వేడుకుంటున్న పరిస్థితి కనిపిస్తున్నది.**



## పచ్చదనంపై పట్టింపేదీ?

- వానకాలం ప్రారంభమైనా హరితహారమేదీ..?
- నర్సరీల్లోనే ఉండిపోయిన కోట్లాది మొక్కలు
- విధివిధానాలు రూపొందించని రాష్ట్ర ప్రభుత్వం
- మొక్కలు నాటేందుకు ఆదేశాలే లేవంటున్న అధికారులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యజ్ఞంలా కార్యక్రమం



మహబూబ్‌నగర్ మండలం రేగడిగడ్డ తండా నర్సరీలో పెరిగిన మొక్కలు

మహబూబ్‌నగర్, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పచ్చదనంపై ప్రభుత్వం శీతకన్ను పడింది. వానకాలం ప్రారంభం కాగానే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యజ్ఞంలా హరితహారం జరిగేది. కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నీలినీడలు కమ్ముకున్నాయి. జూన్ దాటుతున్నా ఇంకా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో మొక్కలు నాటితే పెరిగేందుకు మంచి అవకాశంగా చెప్పొచ్చు. కానీ కాంగ్రెస్ సర్కారు ఈ కార్యక్రమంపై ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో 1720 నర్సరీల్లో 1.23 కోట్ల మొక్కలు ఏపుగా పెరిగి వృథాగా ఉండిపోయే పరిస్థితి దాపురించింది. మమ్మల్ని నాటండి.. అంటున్న మొక్కల వేదన కనిపిస్తుంది. 'నమస్తే తెలంగాణ' బృందం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్సరీల పరిస్థితిపై ఫోకస్ పెట్టింది. కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా మొక్కలు నాటి శ్రీకారం చుట్టేవారు. అంతేకాకుండా గ్రీన్ చాలెంజ్ పేరుతో సెలబ్రిటీలను సైతం ఇందులో భాగస్వామ్యం చేసేవారు. కాగా, కొత్తగా వచ్చిన ప్రభుత్వం మాత్రం పచ్చదనంపై ఇంకా విధివిధానాలు రూపొందించలేదు. దీంతో వర్షాకాలం ప్రారంభమైన కోట్లాది మొక్కలు నర్సరీల్లోనే మగ్గిపోతున్నాయి.

**నర్సరీల్లో కోట్లాది మొక్కలు..**


కేసీఆర్ ప్రభుత్వం ప్రతి పల్లె పచ్చదనంతో నిండిపోవాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామస్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేసింది. మండల, మున్సిపల్ స్థాయిలోనూ అటవీశాఖ ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్ కోసం ప్రత్యేక మొక్కలను పెంచుతున్నారు. మున్సిపాలిటీలు, జిల్లా కేంద్రాల్లో రహదారుల వెంట విభిన్నమైన మొక్కలను నాటి పట్టణాలను అందంగా తీర్చిదిద్దారు. ఏటా జూన్ ప్రారంభం కాగానే హరితహారం నిర్వహించేవారు. అయితే కాంగ్రెస్ సర్కార్ మొక్కల పెంపకంపై నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో అధికారులు సైతం సైలెంట్‌గా ఉన్నారు. ఆరునెలలుగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం.. తమకు అనుకూలంగా లేని అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసే పనుల్లో సర్కారు బిజీ అయింది. దీంతో మొక్కల పెంపకం, నాటడాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని 469 నర్సరీల్లో 32 లక్షల మొక్కలను పెంచేందుకు రూ.కోట్లు ఖర్చు చేశారు. వనపర్తి జిల్లాలో 255 నర్సరీలుండగా.. 18 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జూన్ ప్రారంభం నాటికి నాటేందుకు ఈ మొక్కలను పెంచారు. అయితే సర్కారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మొక్కలన్నీ నర్సరీల్లోనే ఉన్నాయి.

**వర్షాకాలం ప్రారంభమైనా..**

వర్షాకాలం ప్రారంభమైనా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నర్సరీల్లో మొక్కలు వృథాగా పడి ఉన్నాయి. వానలు కురుస్తుండడంతో నర్సరీలన్నీ పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. గతంలో కేసీఆర్ సర్కారు పల్లె, పట్నం, అడవి ప్రాంతాల్లో నాటడంతోపాటు ఇంటికో మొక్కను అందించేది. దీంతో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈసారి హరితహారాన్ని పట్టించుకోకపోవడంతో మొక్కలను నర్సరీల్లోనే సమాధి చేసే పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా సర్కార్ హరితహారం చేపట్టాలని డిమాండ్లు వస్తున్నాయి.



కోయిలకొండ మండలం పారుపల్లి నర్సరీలో..



అయిజ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

## లక్ష్యం 18 లక్షలు.. నాటింది 33 వేలు

- గద్వాల జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరుగారుతున్న లక్ష్యం
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గద్వాల, జూన్ 29 : పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు వాతావరణ కాలుష్యం కాకుండా చేయాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్షాకాలం ప్రారంభం కాగానే విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యమంలా చేపట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో హరితహారం లక్ష్యం నీరుగారుతున్నది. కేసీఆర్ హయాంలో జీపీలు, మున్సిపాలిటీల్లోని నర్సరీల్లో వానకాలం ప్రారంభానికి మొక్కలను సిద్ధం చేసేవారు. ప్రస్తుతం వానలు ప్రారంభమైనా చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలన్నీ నర్సరీలకే పరిమితమయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 జీపీలతో పాటు నాలుగు మున్సిపాలిటీలున్నాయి. 255 పంచాయతీల్లో గత ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది. ఇందులో 25.20లక్షల మొక్కలు ప్రస్తుతం నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 18 లక్షల మొక్కలను నాటాల్సి ఉన్నది. ఇందులో డీఆర్‌డీవో, పీఆర్ పరిధిలో 10.80 లక్షలు, పీఆర్ పరిధిలో 2.80 లక్షలు, డీఆర్‌డీవో పరిధిలో 8లక్షల మొక్కలు నాటాల్సి ఉన్నది. అయితే ఇప్పటి వరకు డీఆర్‌డీవో పరిధిలో 1.40 లక్షల గుంతలు తీయగా 30 వేల మొక్కలే నాటారు. మిగతా శాఖల పరిధిలో ఇప్పటివరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టలేదు. ఇప్పటి వరకు డీఆర్‌డీవో, ఫారెస్ట్ శాఖలు కొంతమేర మాత్రమే మొక్కలను నాటగా.. మిగతా శాఖలు పట్టించుకోకపోవడంతో మొక్కలన్నీ నర్సరీలకే పరిమితమయ్యాయి. మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటి వరకు ఎక్కడా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రారంభించలేదు.

మంచి ఆలోచన, లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపడితే ప్రస్తుత ప్రభుత్వం నీరుగారుస్తున్నదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## నర్సరీలకే పరిమితం

- నారాయణపేట జిల్లాలో 12,01,200 మొక్కల పెంపకం

నారాయణపేట, జూన్ 29 : నారాయణపేట జిల్లాలో హరితహారం అధికారికంగా ఇంకా ప్రారంభించకపోవడంతో నర్సరీలకే మొక్కలు పరిమితమయ్యాయి. నారాయణపేట జిల్లా మొత్తం 280 గ్రామపంచాయతీల్లో 280 నర్సరీలు ఉన్నాయి. 2023-24 ఏడాదికి సంబంధించి ఆయా నర్సరీల్లో వివిధ రకాలకు చెందిన మొత్తం 12,01,200 మొక్కలను పెంచుతున్నారు. ఇందులో 11,25,000 మొక్కలను నాటాలని వివిధ శాఖలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. జూన్ ఒకటి నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 28 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 97 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తొలకరి వర్షాలు తర్వాత జూన్ ప్రారంభంలోనే హరితహారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈసారి అధికారికంగా ఎక్కడా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం కాకపోవడంతో ఎక్కడి మొక్కలు అక్కడే పెరిగి పెద్దవుతున్నాయి. ఉపాధి హామీ కూలీలు అక్కడక్కడా నాటుతున్నారే తప్పా పెద్ద మొత్తంలో.. అన్ని ప్రాంతాల్లో నాటడం లేదు. ఈనెల 12 నుంచి వర్షాల జాడ లేకపోవడంతో అధికారులు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడా మొక్కలు నాటేందుకు చొరవ చూపడం లేదు. జూన్ ముగిసినా మొక్కలు నాటేందుకు అధికారులు ముందుకు రాకపోవడం గమనార్హం. జిల్లా అధికారులు స్పందించి శాఖల వారీగా వారికి కేటాయించిన మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాల్సి ఉన్నది.



ఊట్కూరు మండలం పులిమామిడి నర్సరీలో పెరిగిన మొక్కలు

## వనమహోత్సవమెప్పుడో?

- హరితహారం పేరుమారినా.. అమలులో ఆమడదూరం
- నర్సరీల్లోనే ఎదిగిన మొక్కలు
- మొక్కుబడి సమీక్షలతోనే సరి
- పర్యావరణ పరిరక్షణపై ఏదీ శ్రద్ధ

నాగర్‌కర్నూల్, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : పచ్చదనం పరిఢవిల్లేలా చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన హరితహారంపై రాష్ట్ర సర్కారు శీతకన్ను వహిస్తున్నది. వర్షాకాలం వచ్చినా హరితహారం నుంచి వనమహోత్సవానికి పేరు మారిందే తప్పా మొక్కలు నాటే కార్యాచరణ ఎక్కడా కనిపించడం లేదు. ముసురు పడుతున్న క్రమంలో మొక్కలు నాటితే జూలైలో పూర్తిస్థాయి వర్షాలు కురిసే నాటికి ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. కాగా కార్యాచరణ లేకపోవడంతో అధికారులు ఏర్పాట్లు చేసి ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తుండడం గమనార్హం.



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నర్సరీలో మొక్కలు

**నర్సరీల్లో మొక్కలు.. భూమిపైకి వచ్చేదెప్పుడో..?**

హరితహారంపై ప్రభుత్వ ఉదాసీన వైఖరి అవలంభిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ శాతాన్ని 33 శాతం పెంచేందుకు 2015లో సీఎం కేసీఆర్ అమల్లోకి తీసుకొచ్చిన ఈ పథకంతో గతేడాది వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో 5 కోట్ల మొక్కలను నాటడం విశేషం. ఇలా ప్రతి ఏడాది హరితహారం కార్యక్రమం నాటి నుంచి పండుగలా జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో ఆరు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారాన్ని పట్టించుకోవడం లేదు. తొలి సీఎం కేసీఆర్ పెట్టిన హరితహారం పేరును వనమహోత్సవంగా మార్చింది. కానీ మొక్కలు నాటే కార్యాచరణ మాత్రం ప్రారంభించలేదు. వానకాలం రావడంతో అడపాదడపా వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఇక మొక్కలు నాటేందుకు డీఆర్‌డీవో శాఖ చర్యలు చేపట్టింది. పదేళ్లలో నాటిన లక్ష్యానికి భిన్నంగా తక్కువ సంఖ్యలో నాటేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని నర్సరీల్లోనూ తక్కువ సంఖ్యలోనే మొక్కలను పెంచగా.. నేడు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం జిల్లాలో 4 లక్షల మొక్కలు నాటేందుకు గుంతలను తీశారు. ఇలా ఓవైపు హరితహారం పేరుమారి ప్రారంభానికి సమయం వచ్చినా ప్రభుత్వ కార్యాచరణ మాత్రం సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ప్రతి ఏడాది కోటికిపైగా మొక్కలు నాటారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనిపిస్తున్నది. దీనికి నిదర్శనం గతంలో రోడ్ల వెంట నాటిన మొక్కలు ఎండిపోతుండగా.. పలు చోట్ల గొడ్డలి వేటుకు గురవ్వడమే.

పథకం ప్రారంభమైన 2015లో తక్కువగా 35 లక్షల మొక్కలు నాటగా ఆ తర్వాత ఈ సంఖ్య పెరుగుతూ వచ్చింది. కానీ, ప్రస్తుత ఏడాది కేవలం 23 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల్లో 36 లక్షల మొక్కలను వచ్చే హరితహారానికి పెంచేలా నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాస్థాయిలో అధికారులు మాత్రం సమీక్షలతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు వస్తే ఆచరణలో ముందుకు సాగే అవకాశం కనిపిస్తున్నది.

**ప్రభుత్వ ఆదేశం మేరకే..**

అటవీ శాతాన్ని పెంచేందుకు హరితహారం పథకం అమలవుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 5 కోట్ల వరకు మొక్కలను నాటాం. ఈ ఏడాది 23 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయగా.. నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో 4లక్షల గుంతలను తీశాం.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే నాటేందుకు ఏర్పాట్లు చేస్తాం.

*- చిన్న ఓబులేసు, డీఆర్‌డీవో, నాగర్‌కర్నూల్*

## నీచరాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్

- గ్రామగ్రామానా సర్కారు తీరును ఎండగడుతాం
- మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, ఆల, రాజేందర్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

కల్వకుర్తి, జూన్ 29 : ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర హామీలను కాంగ్రెస్ విస్మరించి అధికారమదంతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ ఇంట్లో మాజీ ఎమ్మెల్యేలతో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలకు వెంకటేశ్ స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు అక్కడున్న నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమై, ఏడు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఎద్దేవా చేశారు. అటువంటి ప్రభుత్వాన్ని ప్రజల ముందు దోషిగా నిలబెట్టే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ పనితీరును గ్రామగ్రామాన ఎండగడుతూ బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పాల బిల్లులు, రైతుబంధు, రుణమాఫీ కోసం రైతులు, ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, తాగునీటి కోసం మహిళలు, కరెంట్ కోతలను నిరసిస్తూ చిన్న, పెద్ద పారిశ్రామికవేత్తలు.. ఇలా అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం, మంత్రులు హైదరాబాద్-ఢిల్లీకి ప్రయాణాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. విషపూరిత రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని ఎందుకు గెలిపించుకున్నామని ప్రజలు నేడు బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

